క్లుప్తంగా

బస్తీ దవాఖానా సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

కోరుట్ల: పట్టణంలోని హాజీపురా బస్తీ దవాఖానాను మంగళవారం జగిత్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సందర్శించారు. బస్తీ దవాఖానాలో రికార్డులు, స్టాక్ ఉన్న మందులు, రిజిస్టర్లు, రోగులకు ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయన్న అంశాన్ని పరిశీలించారు.

జీఎంఆర్ విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కార్తీక్

రాయికల్: పట్టణంలోని చిన జీయర్‌స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, ప్రతిమ ఫౌండేషన్ సమన్వయంతో ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు మంగళవారం ప్రతిమ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కార్తీక్ సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజర్లు కౌశిక్, గీతారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు నిల్వ చేసినందుకు జరిమానా


దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

కోరుట్ల: పట్టణంలోని పలు షాపుల్లో మంగళవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడుతుండడంతో జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను బహిష్కరించి పర్యావరణానికి మేలు కలిగించే రీతిలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ అంజయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో చైర్‌పర్సన్ దంపతుల పూజలు


పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ దంపతులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీఅష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మగళవారం స్వామివారిని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గుగ్గిళ్ల హరీశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ కోళ్ల పెంపకంపై శిక్షణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

కోరుట్ల: పీవీ నర్సింహారావు పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం మేడిపల్లి మండల రైతులకు బ్రాయిలర్ కోళ్ల పెంపకం, యాజామాన్య పద్ధతులు అన్న అంశంపై శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో ఈ అంశంపై అవగాహన కోసం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ తక్కళ్లపల్లి మాధవరావు, పశుగణ క్షేత విభాగాధిపతి డా. శ్రీదేవి, డా. శిరీష, సుష్మ, దివ్య, సురేశ్, రవికాంత్, సౌమ్య పాల్గొన్నారు.

నేడు కోరుట్లలో 5 కే రన్

కోరుట్ల: ఓటరు చైతన్యం కోసం నేడు కోరుట్ల పట్టణంలో 5 కే రన్ నిర్వహించనున్నట్లు ఆర్డీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం బీఎల్‌వోలు, మున్సిపల్ ఆర్పీలు, అన్నిశాఖల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

అడ్డగోలుగా మట్టి దందా

- గుట్టలు తవ్వుతూ కోట్లు కొల్లగొడుతున్న మట్టి మాఫియా
- కనుమరుగవుతున్న ప్రకృతి సంపద
- పట్టించుకోని అధికారులు


అక్రమంగా ట్రాక్టర్లతో తరలిస్తున్న మట్టి


గుట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వెల్గటూర్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమార్కులు ప్రకృతి సంపద కొల్లగొడుతున్నా కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతుంది. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి మాఫియా అక్రమంగా గుట్టలు మొత్తం తవ్వేసి కోట్లు గడిస్తున్నారు. పట్టపగలే జేసీబీలతో గుట్టలు తవ్వి యథేచ్ఛగా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. యథేచ్ఛగా ఇంత పెద్ద మొత్తంలో అక్రమ వ్యాపారం సాగుతున్నా ఈ మట్టి మాఫియా వెనకున్న సూత్రధారులు, పాత్రధారుల గురించి అధికార యంత్రాంగానికి మాత్రం తెలియకపోవడం శోచనీయం. శనివారం అధికారులు జేసీబీలను, టిప్పర్లను, ట్రాక్టర్లను ఘటనా స్థలంలోనే పట్టుకున్నా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

ఎండపల్లి మండల కేంద్రంలోని జొన్నలరాశి గుట్ట, పాతగూడూర్ లోని దస్తగిరి గుట్ట, ఎండపల్లి, గులకోట గ్రామాల శివారుల్లోని మిట్టతాళ్ల గుట్టలను ఇష్టానుసారం తవ్వేసి గుట్టలను కనుమరుగు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టి వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతుందని మండల ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఎండపల్లికి సమీపంలోని ధర్మారం మండల కేంద్రంలో నూతన నిర్మాణాలకు, నూతనంగా

చర్యలు మాత్రం శూన్యం

నూతన గృహనిర్మాణాలకు గానీ ఏదేని అవసరాలకు గానీ మట్టిని తరలించాలంటే రెవెన్యూ మరియు మైనింగ్ శాఖల అనుమతి తప్పనిసరి. ముందుగా రెవెన్యూశాఖ అనుమతి తీసుకొని తర్వాత మైనింగ్ శాఖకు నిర్ణీత పన్ను చెల్లించి అనంతరం మట్టి తవ్వకాలు చేపట్టాలి. కానీ ఎండపల్లి మండలంలో ఈ నిబంధనలు తిలోదకాలిచ్చిన మట్టి మాఫియా ఇష్టానుసారం మట్టిని తవ్వేస్తున్నారు. శనివారం అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను, జేసీబీలను టిప్పర్లను ఘటనా స్థలంలోనే అధికారులు పట్టుకున్నా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ అక్రమ మట్టి తరలింపు గురించి జగిత్యాల మైనింగ్ ఏడీని వివరణ కోసం సంప్రదిస్తే అధికారి ఫోన్‌కు స్పందించడం లేదు.

మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదు

ఎండపల్లి మండలంలో మట్టి తవ్వకాలకు ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. మట్టి తవ్వకాలకు అనుమతులు జిల్లా మైనింగ్ కార్యాలయం నుంచి మాత్రమే ఇస్తారు. మండలంలో అక్రమంగా మట్టి తరలిస్తే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– రవికాంత్, తహసీల్దార్, ఎండపల్లి

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


మెట్‌పల్లి పట్టణంలో మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే

మెట్‌పల్లి: పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అధికారులకు సూచించారు. గుడ్ మార్నింగ్ కోరుట్లలో భాగంగా మంగళవారం పట్టణంలోని 23 వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ముఖ్యంగా చాలా చోట్ల టెండర్లు పూర్తయినప్పటికీ డ్రెయినేజీల నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని కౌన్సిలర్ ఒజ్జెల బుచ్చిరెడ్డి తెలుపగా, వెంటనే అధికారులకు ఫోన్ చేసి పనులను పూర్తి చేయించాలని ఆదేశించారు. అలాగే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కౌన్సిలర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు పూదరి సుధాకర్, ఒజ్జెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో ముందుకెళ్లాలి

మల్లాపూర్: యువత సన్మార్గంలో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎంసీసీ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు మంగళవారం విచ్చేసి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల దశ నుండే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని సూచించారు. అనంతరం వీడీసీ చైర్మన్ సంగ గంగరాజంను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం జామమజీద్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకుతోట రాజేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు లింగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. పట్టణంలోని శివాజీనగర్‌లో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు మంగళవారం జువ్వాడి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, యామ రాజయ్య, హన్మాండ్లు, పూదరి నర్సాగౌడ్, చెర్లపల్లి రాజేశ్వర్, తుమ్మనపల్లి రాంప్రసాద్, జెట్టి లక్ష్మణ్, కొంద్ర అరుణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కోరుట్ల: పట్టణ పద్మశాలీ కులోన్నతి సంఘం మాజీ అధ్యక్షుడు జక్కుల ప్రసాద్, అయిలాపూర్ సింగిల్ విండో చైర్మన్ చింతకుంట సాయిరెడ్డి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మచ్చ కవిత, ఎంపీటీసి చింతకుంట వనిత, సంజీవ్‌రెడ్డి, నక్క సుధీర్, కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు శౌందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

కోరుట్ల: చిరు వ్యాపారులకు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ హాకర్స్ అసోసియేషన్ కోరుట్ల అధ్యక్షుడు షాహిద్ షేక్ మహ్మద్ మంగళవారం కాంగ్రెస్ పార్టీ సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు వినతిపత్రం ఇచ్చారు. చిరువ్యాపారులు దీన స్థితిలో ఉన్నారని వారందరిని ఆదుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు.

ఎస్సెస్సీ పరీక్ష కేంద్రంలో డీఈవో తనిఖీ

కథలాపూర్: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ పరీక్ష కేంద్రాన్ని డీఈవో జగన్మోహన్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని అన్ని గదులను పరిశీలించారు. పరీక్షల నిర్వాహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట చీఫ్ సూపరింటెండెంట్ నరసింహమూర్తి ఉన్నారు.

'బార్' అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ

జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 28న జరగనున్న విషయం తెల్సిందే. అధ్యక్ష పదవి మినహా మిగిలిన పోస్టులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు నక్కల సంజీవరెడ్డి, క్యాస కృపాల్‌కుమార్ తెలిపారు. అధ్యక్ష పదవికి ఇద్దరు సీనియర్ న్యాయవాదులు డబ్బు లక్ష్మారెడ్డి, రాచకొండ శ్రీరాములు పోటీ పడుతున్నారు. వీరు ఓటు హక్కు ఉన్న 216 మంది న్యాయవాదులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

'జీవన్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలి'

కోరుట్ల: కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ జీవన్‌రెడ్డి కెటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెదలు సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం కోరుట్లలో మాట్లాడారు. ఈ ప్రాంతంలో షుగర్ ఫ్యాక్టరీ సమస్య, పసుపు రైతుల కష్టాలపై పూర్తి అవగాహన ఉన్న నేతగా జీవన్‌రెడ్డికి గుర్తింపు ఉందన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో వ్యవసాయ పరమైన అనేక సమస్యల పరిష్కారానికి జీవన్‌రెడ్డికి గతంలో కృషి చేశారని గుర్తు చేశారు. వెంటనే అధిష్టానం టికెట్‌ను ప్రకటించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కథలాపూర్: మండలంలోని తాండ్యాల చౌరస్తా వద్ద పానుగంటి అరుణ్ ఫౌండేషన్ తరపున ఏర్పాటు చేసిన చలివేంద్రంను మంగళవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు పానుగంటి శ్యామ్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు చేయాలి

ధర్మపురి: గ్రామాలా అభివృద్ధి కోసం చేసిన బిల్లులు త్వరగా మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ సర్పంచులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నేరెళ్ల, తీగలధర్మారం గ్రామాల మాజీ సర్పంచులు పలిగిరి వసుందర, అందాళు మంగళవారం సీఎంకు ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో హరిత హారం, పల్లె ప్రకృతి వనాలు, సీసీరోడ్ల పనులు, పైపులైన్లు తదితర పనుల కోసం లక్షలాది రూ.లు అప్పు చేసి పనులు పూర్తి చేశామని, గత రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో తెచ్చిన అప్పులు రెండింతలు అవుతున్నాయని, వెంటనే బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచులు కోరారు.

గంజాయి స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: గంజాయి స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఏబీవీపీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి మత్తులో యువత బానిసలై రేవ్ పార్టీలకు వెళ్తున్నట్లు వార్తలొస్తున్నాయని, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మత్తుకు బానిసలైన యువతను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాపాక సాయి, నగర సంయుక్త కార్యదర్శి జశ్వంత్, అరవింద్ పాల్గొన్నారు.

కేసు నమోదు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని నల్లగుట్ట ప్రాంతంలో ఓ సామాజిక వర్గానికి చెందిన విగ్రహం విషయంలో జరిగిన గొడవలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు గొల్లపల్లి పోలీసులు తెలిపారు.

క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

కోరుట్ల: పట్టణంలోని ఏజేఎం కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి కోరుట్ల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఇఫ్తార్ విందులో క్రీడాకారులు, పట్టణంలోని ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోరుట్ల క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడు మోయిస్, గౌరవ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, ప్రతినిధులు బాలరాజ్, అరుణ్, హమీద్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వీర్‌సింగ్

మల్లాపూర్: ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఎన్నికలకు 10రోజుల ముందు వరకు నూతన ఓటర్లుగా నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతుల కల్పించి పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, ఏఎస్‌వో శ్రీనివాస్, ఆర్ఐ సురేశ్, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ముగిసిన బ్రహ్మోత్సవాలు


స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

కోరుట్ల: పట్టణంలోని అష్టలక్ష్మీ ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు స్వామి వారికి మంగళస్నానాలు, నారసింహ వహన హోమ క్రతువు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బూరుగు రామస్వామి–సుభద్ర దంపతులు మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల్లో సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మధుసూధనాచార్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం


వేములకుర్తిలో రథోత్సవంలో భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఘనంగా రథయాత్రను నిర్వహించారు. ముందుగా రథం వద్ద బలిహరణ, ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. రథోత్సవంలో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల ప్రతిష్ఠాపన వేడుకలు

సారంగాపూర్: మండల కేంద్రంలో నాలుగు రోజుల పాటు జరుగుతున్న గ్రామ దేవతల ప్రతిష్ఠాపనోత్సవాల్లో మంగళవారం రెండో రోజు విశ్వక్సేన విధి, వాసుదేవ పుణ్యాహవాచన విధి, మహాకుంభ హారతి, పత్రాధివాసం, ఫలాదివాసాం, ఛాయాధివాసం, బలిదానవిధి తదితర పూజలు జరిగాయి. బుధవారం వేకువజామున 4 గంటలకు ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనుంది.

గంగగౌరీశ్వర ఆలయ హుండీ లెక్కింపు

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేట గంగగౌరీశ్వర స్వామి ఆలయ హుండీ, టికెట్ల ఆదాయాన్ని ఆలయ కమిటీ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. మొత్తం రూ.1,66,785 వచ్చాయని దేవాదాయ ధర్మదాయ శాఖ డివిజన్ పరిశీలకులు(ఇన్‌స్పెక్టర్) ఆర్.రవికిషన్ తెలిపారు. కార్యక్రమంలో ఈవో విక్రమ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎలాల కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు తోట సుజాత, గుగ్లావత్ భూమి, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని మంగళవారం సిబ్బంది లెక్కించారు. హుండీలో భక్తులు వేసిన కానుకలు లెక్కించగా.. రూ.60,928 వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ లెక్కింపులో ఈవో విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, అర్చకులు నరసింహచారి, భక్తులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై నిరసన


నిరసన తెలుపుతున్న రైతు భూమానందం

కోరుట్ల: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య ధోరణికి నిరసనగా కోరుట్లకు చెందిన సీనియర్ సిటిజన్ వాసం భూమానందం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నేలపై కూర్చుని నిరసన తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడారు. తనకు 1287 సర్వే నంబరులో 1 ఎకరం భూమికి యాజమాన్య హక్కు పత్రాలు కలిగి ఉన్నాయని, రెవెన్యూ రికార్డుల్లో తప్పుగా ప్రభుత్వభూమిగా నమోదైందని దాన్ని సరిచేయాలని కోరుతూ మీ సేవలో దరఖాస్తు ఇచ్చానని తెలిపారు. రెండు సార్లు భూమి దున్ని చదును చేశానన్నారు. అప్పటి తహసీల్దార్ అనుకూల నివేదిక ఇచ్చినప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదన్నారు. ఆరు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సీనియర్ సిటిజన్‌గా రోజుల తరబడి తహసీల్దార్ కార్యాలయానికి వస్తూ అలసిపోయానన్నారు. నిరాశ, నిస్పృహతో ఈ రోజు కార్యాలయం ముందు నిరసన దీక్షకు దిగానన్నారు. ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు.

రైతులు ఆధునిక వ్యవసాయం చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, అధికారులు

ఇబ్రహీంపట్నం: రైతులు ఆధునిక వ్యవసాయం చేయడానికి అలవాటు పడాలని శాస్త్రవేత్త డాక్టర్ యస్. రామ్‌గోపాలవర్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సమగ్ర వ్యవసాయం, డ్రోన్లతో వ్యవసాయంపై శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా వరి విత్తే పద్ధతులను వివరించారు. డ్రోన్‌ల ద్వారా పంటలకు చీడ, పీడ పురుగులను నివారించేందుకు రసాయన ఎరువులు చల్లడం వల్ల సమపద్ధతిలో పడుతుందని దీని వలన రైతులకు కూలీలు బెడద కూడ ఉండదని, పెట్టుబడి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎన్.గోవర్ధన్ ఏవో దీపిక, ఏఈవోలు నరేశ్, రవళిక, హరీశ్, రైతులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

సారంగాపూర్: రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయాధికారి తిరుపతి నాయక్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ రైతు వేదికలో రైతు నేస్తంలో భాగంగా సమగ్ర వ్యవసాయం, డ్రోన్లతో వ్యవసాయం, అన్న అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. గోవర్ధన్, డాక్టర్ రామగోపాల్‌వర్మ రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గండి మల్లికార్జున స్వామి, గొల్ల కేతమ్మ జాతర


పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామ శివారుల్లోని శ్రీ మల్లికార్జునస్వామి, గొల్ల కేతమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పాల్గొని పూజలు నిర్వహించారు. వారి వెంట మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు

రాయికల్: మండలంలోని కట్కాపూర్‌లో వెన్నముద్దలగండి ఆవరణలో ఉన్న మల్లికార్జునస్వామి, గొల్లకేతమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోపి రాజిరెడ్డి, రాజేందర్‌రావు, సుధాకర్‌రెడ్డి, గంగాధర్, ప్రసాద్, మహేశ్ పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత


పుస్తెమెట్టెలు అందిస్తున్న రాజేందర్

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన ఓ యువతి వివాహానికి పుస్తెమెట్టెలను అందజేసి తన ఉదారతను చాటుకున్నాడు ఓ యువకుడు. గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం ఆత్మకూరి స్వామి–పద్మ కూతురు అంకిత వివాహం బుధవారం జరగనుంది. మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన కొమురవెల్లి రాజేంద్రప్రసాద్ అనే యువకుడు మంగళవారం పుస్తెమెట్టెలు దుస్తులు కానుకగా అందించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రావు, మోహన్‌రెడ్డి, చంద్ తదితరులు పాల్గొన్నారు.